# సవాళ్లను సుసాధ్యం చేయండి

- ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణమూర్తి
- హైబ్రిడ్ మాధ్యమంలో భువనేశ్వర్ ఐఐటీ 10వ కన్వొకేషన్




వర్చువల్ మాధ్యమంలో ప్రసంగిస్తున్న ఎన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి

**భువనేశ్వర్:** అసాధ్యమైన సవాళ్లని సుసాధ్యం చేయడం ఐఐటీ ఉత్తీర్ణతకు పట్టం గడుతుందని ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణమూర్తి ఉద్బోధించారు. భువనేశ్వర్ ఐఐటీ 10వ కన్వొకేషన్ ఉత్సవం బుధవారం నిర్వహించగా.. వర్చువల్ మాధ్యమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. విద్యాభ్యాసం పరిపూర్ణత సాధించేందుకు పరిశోధన నిరంతర ప్రక్రియని గుర్తుచేశారు. వైజ్ఞానిక, సాంకేతిక, ప్రాకృతిక వనరులతో తులతూగుతున్న మన దేశం.. పరిశోధనకు అనుకూలంగా ఉందన్నారు. విద్యార్థుల వైజ్ఞానిక పరిశోధనలు కనుసన్నల్లో ఉన్న సమస్యలు, అవసరాలు అధిగమించేందుకు పరిమితం కాకూడదని హితవు పలికారు. సుదూర ఆలోచనలు అత్యాధునిక ఆవిష్కరణలను తేజోవంతం చేస్తామన్నారు. ఉజ్వల సమాజం ఆవిష్కరణలో ప్రతి విద్యార్థి ఆలోచన ఆదర్శవంతం కావాలని ప్రేరేపించారు. వాగ్దానాల వాస్తవ కార్యాచరణ నిజమైన నాయకత్వ లక్షణమని, నాయకత్వ లక్షణాలతో విద్యావంతులు మేధాశక్తిని ప్రయోగించి సమాజ నిర్మాణంలో ఉదాహరణగా నిలవాలని ఆకాంక్షించారు. అవినీతి రహిత సమాజ నిర్మాణ మాటలకు పరిమితం కాకుండా, నిరంతర కార్యాచరణ కావాలని సూచించారు. ఈ దిశలో ప్రతి విద్యార్థి పాలుపంచుకుని దేశాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని తెలిపారు. విద్యారంగంలో ఉన్నత ఉత్తీర్ణత సాధించిన మేధావంతులు సృజనాత్మకతకు ప్రాణం పోయాలన్నారు.

**ఆలకించండి.. ఆచరించండి..**

నిజాయితీ, హృదయపూర్వక అంకితభావం కార్యాచరణతో బలమైన భారతదేశం నిర్మాతలుగా వెలుగొందాలని ఐఐటీ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ సింఘ్ పిలుపునిచ్చారు. కన్వొకేషను కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. భావి కార్యాచరణ ఊహలకు పరిమితం కాకుండా నిర్మాణాత్మక పురోగతి సాధన దైనందిన జీవనంలో భాగం కావాలని సూచించారు. మార్గదర్శకంగా నిలిచేందుకు శ్రద్ధగా వినడం అత్యంత ప్రధాన్యమని, విన్నది అక్షరాల ఆచరించడం పటిష్టమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని తెలిపారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో ఈ అవకాశం ప్రతి ఒక్కరికీ కల్పించేందుకు విభిన్నంగా హైబ్రిడ్ మాధ్యమంలో ఏర్పాటు చేసినట్లు ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్‌వీ రాజకుమార్ తెలిపారు. ఏటా సరికొత్త కోర్సులు ప్రవేశపెట్టి, నవ భారత్ నిర్మాణానికి ఉజ్వలమైన పౌరులను తీర్చిదిద్దేందుకు ఐఐటీ నిరంతరం కృషి చేస్తోందన్నారు. 10వ కన్వొకేషను పురస్కరించుకుని మేధావంతులకు భారత రాష్ట్రపతి, డైరెక్టర్ బంగారు పతకాలతో పలు వర్గాల ప్రత్యేక బహుమానాలు ప్రదానం చేశారు. దినేష్ మహంతి రాష్ట్రపతి బంగారు పతకం, డైరెక్టర్ బంగారు పతకం శివంహాందా, శాస్వతకుమార్ పండా, హితేష్ గుప్తా డైరెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఉత్తమ పురుష గ్రాడ్యుయేట్‌గా దినేష్ మహంతి డాక్టర్ కె.కస్తూరి రంగన్ అవార్డు సాధించారు. ప్రొఫెసర్ పి.రామారావు అవార్డును ఉత్తమ మహిళా గ్రాడ్యుయేట్‌గా అనేరి మనోజ్‌గాంధీ అందుకున్నారు. బీటెక్(మెకానికల్) ఉత్తమ థీసెస్ దినేష్ మెమోరియల్ అవార్డును ఆకర్ష్ బాలచంద్రన్, విద్యుత్ విభాగానికి సంబంధించి తేజేశ్వరి మెమోరియల్ అవార్డు మనోజ్ గాంధీకి లభించింది. కరోనా ఆంక్షల నేపథ్యంలో సుదూర ప్రాంతాల నుంచి పలువురు ఉత్తీర్ణ విద్యార్థులు హైబ్రిడ్ మాధ్యమంలో పాలుపంచుకోవడం విశేషం. జాతీయ గీతాలాపనతో 10వ కన్వొకేషన్ కార్యక్రమం సందడిగా ముగిసింది.